## కథ

# పిచ్చితల్లి

వృద్ధాప్యం యింత భయంకరంగా వుంటుందని తను జీవించే కాలంలో సరస్వతికి తెలుసుంటే యీ జీవితాన్ని ఎప్పుడో చాలించి వుండేది. అలా జరగటం మానవ న్యాయం కాదు. అలా చని పోగలిగితే యిప్పుడీ జనాభా సమస్యే లేకపోవు. మనిషి పుట్టినప్పట్నుంచీ ఆట పాటలతో పోగా మిగిలిన జీవితాన్ని ఏదో చేస్తున్నానని చెయ్యవలసిందేదో వుందనీ జీవిస్తూ వుంటాడు. ఆఖరుకి అన్నీ తీరిపోయిం తరువాత ''నీకేం తెలీదు తాతయ్యా! ఊరుకో'' అని మనవడు అన్నప్పుడు-అప్పుడు గుండె పగిలి చస్తాడు. అదే యవ్వనంలో భార్యా పిల్లలు తనని ఎద్దేవా చేసినా తిరగబడతాడు. వాళ్లతో గొడవ పెట్టుకుంటాడు. అది వయసులో వున్న శక్తి. ఇది వృద్ధాప్యంలో విరక్తి.

అలాగే సరస్వతి కూడా ప్రతి సంఘటనకి యిప్పుడు భయపడ్తుంది. ఇలా ఎందుకు జరుగుతుంది. తనకి ఓ యింగ్లీషు కవిగారు రాసిన పద్యం గుర్తుకొచ్చింది. ఓ పడుచు వాడు '' ఏమిత్రా ప్రకృతి యింత పచ్చగా-సూర్యాస్తమయం యింత ఆహ్లా దంగా-సూర్యోదయం యింత వేడిగా-చెట్లూ, చేమలూ యింత సుందరంగా వున్నవి'' అని ఆలోచిస్తాడు.

అదే చంటిపిల్లాడు 'హబ్బ! యీ సూర్యుడు చూడు నేను ఆడుకునే బంతిలా-ఆ చెట్లు చూడు మనం తినటానికి యిచ్చే పళ్లతో-ఎండ బాగావుంటే అమ్మలూ బామ్మలూ-ఏదో మూల పడుకుంటే మన యిష్టం వచ్చి నంత అల్లరి చేసుకోవచ్చు' అని ఆలోచిస్తాడట. అదే ముసలి వాడైపోతే 'హబ్బ యీ ప్రకృతి ఎక్కడ చూసినా దుమ్ము, ధూళితో ఊదారంగులో చికాకు పెడుతోంది. ఈ ఎండ మనిషిని నిలవనివ్వకుండా మాడ్చేస్తుంది. ఈ రాత్రి చలి చంపేస్తుందీ' అని బాధపడ్తాడట. ఇలా ఒకే ప్రకృతిని గురించి-మనుషుల్లో మూడు రకాలేమిటీ, యింకా అనేక రకాల అభిప్రాయాలూ కలగటానికి, ఆ మానవుడి మనస్థితి తప్ప-ప్రకృతి కారణం కాదు అంటాడు ఆ కవి. ఈ వాక్యం తను చదువుకొన్నప్పటిదే అయినా దాన్నింకా సరస్వతి జీవిత చరమాంకంలో కూడా మర్చిపోలేదు. ఇటువంటి తన జీవితా నుభవాలెన్నో తన మనుమలతో పంచుకోవాలనే వుబలాటం వుండేదామెకు. అలాగే తన మనుమలు చిన్నపిల్లలుగా వున్నప్పుడు తాను ఆనందాన్ని అనుభవించింది.

భవ్య, రమ్య, కావ్య అనే తన మనుమరాళ్లు-ఓ మను మడూ- తన చుట్టూ చేరి ''నాన్నమ్మా! ఓ కథ చెప్పు'' అన్న ప్పుడు-తానిలా చిన్న చిన్న విషయాలన్నీ ఏర్చి కూర్చి పెద్ద కథలుగా చెప్తుంటే-ఆ డాబామీద వాళ్ల నవ్వులకు ఆ వెన్నెల కూడా దడుచుకుని మేఘాల చాటుకు పారిపోయేది. ఏవీ ఆ నవ్వులు. ఇప్పుడంతా నిశ్శబ్దమే, పెద్ద మనుమరాలు పెళ్లై అత్తారింటికి వెళ్లిపోయింది. రెండోది-పెద్ద చదువులు చదివి-ఏదో పెద్ద కంపెనీలో మంచి పొజిషన్‌లో వుంది. మూడోది-ఉన్న మగ పిల్లాడు-పెద్ద డిగ్రీలతో ఫస్టు రాంకుల కోసం కుస్తీలు పడ్తూ అసలు మాట్లాడనే ఆడరు. తను పలకరించాలని ఉబలాటపడ్డా-'ఉష్'- అనేసి లోప లకు వెళ్లిపోతారు.

ఏది ఆ బాల్యం.

★★★

తన బాల్యం, దాని గురించి వెదుక్కోవాలంటే చాలా వెనక్కు వెళ్లిపోవాలి. అంతా యింతా కాదు. 70 వసంతాలు. ముందుకు వచ్చేసిందే. ముందుకైతే రాగలిగింది కానీ అలా వెనక్కు వెళ్లే శక్తి, తనకే కాదు యీ సృష్టికే లేదు. అలా మనిషి చెయ్యలేని ఆ పనిని యీ మనస్సు చెయ్యగలదు. అదే యిప్పుడామెకు మిగిలింది కూడా. డెబ్భయ్యోపడిలో పడినా తనకు చూపు తగ్గలేదు. పళ్లు రాలలేదు. వళ్లు జంక లేదు. నాకింత వయసా అనుకున్నప్పుడు మనసే జంకు తుంది. తనకిప్పుడొచ్చిన లోటు లేదు. వేళ తప్పకుండా భోజనం పెట్టే కోడలూ, '' అమ్మా హాయిగా ఎక్కడో ఓ చోట కూర్చోక, ఎందుకే అలా అన్ని పనుల్లో నువ్వే వుంటావు'' అని ప్రేమగానే మందలిస్తూ తన చేతులూ కాళ్లూ కట్టేసే కొడుకూ యివన్నీ నాకు సుఖాలే అనుకుంటే ఆమెకొచ్చిన బాధేమీ లేదు.

ఎటొచ్చీ ''అమ్మా వంటయిందా? అమ్మా నాకు తొంద రగా జడవెయ్యవె, స్కూలుకి వెళ్లాలి అనే కూతురూ, నాకు టిఫిన్ పెట్టకుండా ఏం చేస్తున్నావే అనే యింకో కొడుకూ, ఊ! నీ పిల్లల గొడవేనీకు గాని యీ మొగుడొకడున్నాడు, వీడికి ఓ ఆఫీసుంది వాడి గురించి పట్టించుకోవాలి అని ముద్దుగా కసురుకునే భర్త- ఇలా ఆరుగురు పిల్లలతో భర్తతో గడిపిన యవ్వనం-అందరినీ వేకొలిక్కి తెచ్చి-ఎక్కడె క్కడో స్థిరపడిన పిల్లల గురించి తల్చుకుంటూ- ఏ ఒక్క బిడ్డనూ దగ్గర వుంచుకోలేకపోయినందుకు విచారిస్తూ, భర్తతో ఏకాంతంగా వాళ్ల కోసం నిర్మించుకున్న లంకంత యింట్లో-రిటైరయిపోయిన భర్తతో ఏకాంతంగా-పిల్లల పుత్తరాలకోసం-వాళ్ల రాకకోసం- తపించిపోతూ గడిపిన జీవితం-యిప్పుడా భర్తని కూడా పోగొట్టుకుని, మద్రాసులో కొన్నాళ్లు- ఢిల్లీలో కొన్నాళ్లు, హైదరాబాద్‌లో కూతురు నాద గ్గరే వుండిపో అని గొడినప్పుడు మొహమాటంగా-ఎంతైనా కొడుకులను వదిలేసి అల్లుడింట్లో వుండన్న అపప్రధ బావుండదేమోనే అని కూతురికి తను సర్దిచెప్పటం ఫలి తంగా తను యిప్పుడీ కొడుకింట్లో వుంది. ఎక్కడున్నా తనకు యిబ్బంది లేదు. యిబ్బందల్లా యీ వంటరితనమే.

తను చిన్న వయసులోనూ-అప్పటి సమాజానికి భిన్నంగా నాగరీక కుటుంబంలోనే పుట్టింది. తల్లి అప్పుడే చదువు సంధ్యలు నేర్చిన పండిత కుటుంబంలో నుంచి వచ్చింది. తండ్రి అప్పటి ధనవంతుల్లో వకరిగా వుండ లని-అప్పటి సాంప్రదాయంగా బర్మా వెళ్లి రెండు చేతులా సంపాదించుకొచ్చి-ఇండియాలో అప్పటి ఏ వూరూ నచ్చక-మద్రాసులో తనకని ఓ పెద్ద బిల్డింగు ఏర్పరచు కొని-అనేక భాషల్లో మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధి చేసు కున్న వ్యక్తి. అందుకే సరస్వతీ-ఆమె తమ్ముళ్లు నలుగురూ బాగా విద్యావంతులు కాగలిగారు. తనను మటుకు అప్పటి మెట్రిక్ వరకూ చదివించటమే గొప్ప. అదీ మద్రాసు మహా నగరంలో వున్నారు గనుక. అప్పటి దొరల పిల్లలతో తిరిగి వాళ్ల సాంప్రదాయాలన్నీ ఒంట బట్టించుకొంది. ఆ చదువ య్యేసరికే అత్తయ్య వచ్చి నాన్నగారితో మాట్లాడి-తన కొడుకు గురుమూర్తితో తన వివాహం జరిపించుకొంది.

అందులో అడ్డు చెప్పాల్సిందేమీ తనకు కనిపించలేదు. కాకపోతే తను మద్రాసు జీవితానికి అలవాటు పడితే అత్తయ్యా వాళ్లూ ఆంధ్రదేశంలో స్థిరపడిన వ్యవసాయ కుటుంబం. బావ ఎలాగూ చదువుకుని వుద్యోగం సంపాదిం చుకుని వున్నాడు గనక తనకూ అత్తవారింట్లో వుండాల్సిన అవసరం లేదు. అందుకే నాన్నగారు వప్పుకుని యీ పెళ్లి చేసేరు. అప్పుడీ సంబంధం నీకు నచ్చిందా లేదా అని ఎవరూ అడిగే వారు కాదు. ఆడపిల్లను-నీకు పెళ్లి కుది ర్చాము అనిమట్టుకే చెప్పారు నాన్నగారు. తనూ అడ్డు చెప్ప లేదు.

పెళ్లి చేసుకుని ఆంధ్రదేశం వచ్చేసిం తరువాతనయినా ఒక్కొరిలో లేదు తను. అప్పట్లో రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో రెండు మూడేళ్లకోసారి-ట్రాన్స్‌ఫర్‌లని తెగ మారుస్తుండే వారు. అప్పుడు యీ పిల్లలు-వాళ్ల చదువులూ-వీళ్ల గురించి ఆలోచించి ఆ వుద్యోగిని ఆ వూరు నుంచి మరో వూరు మార్చటం జరిగేది కాదు. వాళ్లకెప్పుడనుకుంటే అప్పుడే ఆ వుద్యోగిని ఆవూరు నుంచి మరో వూరు మార్చేసే




వారు. అక్కడి నుంచి యీ సామానంతా వేసుకుని మరో వూరు వెళ్లటానికి-సరైన సదుపాయాల్లేని ఆ రోజుల్లో చాలా తిప్పలు పడి ఆ వూరు చేరేవారు. అద్దెయిల్లని, పిల్లలకు చదువులని అన్నీ అలవాటు పడనిచ్చి యింకోచోటికి పొమ్మనే వారు. ఇలా వుండేవి అప్పటి పరిస్థితులు.

★★★

ఆరోజు ప్రొద్దున్నే యింట్లో అంతా హడావిడిగా వున్నారు. వీధిలోకి తొంగి చూస్తే పెద్ద పెద్ద ముగ్గులతో గుమ్మం అలంకరించి వుంది. పిల్లలంతా కేరింతలు కొడుతూ-మంచి డ్రెస్ సెలక్షన్‌లో ఒకరూ-టిఫిన్లు, ఏమేమి చెయ్యాలో వాళ్లమ్మకు చెబుతూ వకరూ-, తననెవ్వరూ పట్టించుకోవటం లేదు, ఆలోచిస్తే ఆరోజు ఏ పండుగా కాదు. మరేమిటబ్బా- అంతలో కొడు కూ, మనమరాలూ ఎక్కడికో వెళ్లటానికి ఆయత్తమవుతున్నారని పసికట్టింది.

''ఏమిటిరా అబ్బాయ్, హడావుడి!'' అంది మనవడినుద్దేశించి.

''ఆ! అడిగావ్. అన్నీ నీకే కావాలి. అప్పుడే కొంప మునిగిపోతున్నట్టు ఎందుకు లేచి కూర్చున్నావ్. పెద్దదానివి. పనీ పాటూ లేనిదానివి. ఇంకాస్సేపు పడుకుని వుండొచ్చుగా'' అంటూ తండ్రిని అనుసరించాడు.

''అదేమిటిరా! నాన్నమ్మ అడిగిన దానికి సమాధానం చెప్పొచ్చుగా'' అని తండ్రీ అనలేదు. మళ్లీ ఆమె మనసులో మౌనం. ఇంట్లో హడావుడి-మనవడి సమాధానం చెప్పాక యింకా విషయం ఎవ్వరినీ అడగబుద్ధి కాలేదు ఆమెకు.

మళ్లీ మనసు గొణగటం మొదలుపెట్టింది. ఆ యిల్లూ తనది కాదు. యీ మనుషులూ, తనవాళ్లు కాదు. తన గర్భవాసమైన ఆ కొడుకే వాళ్ల మనిషి. తన వయసు దృష్టితో చూసినా యిప్పుడు వాళ్లకు హేళనగానే వుంది. తన కాపురంలో మూలనున్న చీపురు కదలాలన్న తన అనుమతి కావాలి. అమ్మ యిల్లు వూడవనా, అమ్మా స్నానానికెళ్లనా, అమ్మా అన్నం పెట్టుకుంటానే అని వాళ్లు చేసుకొనే పనులకి కూడ తన అనుమతి అడిగిన పిల్లలేనా వీళ్లు. ఇంటికి బంధువులొచ్చినా-ఎక్కడికైనా వెళ్లాలన్నా ''వదినా యీ రోజు మా పాపకు తలంటు పోసుకోవాలి'' అని తనను పర్మిషన్ అడిగే ఆడబిడ్డ-పిల్లలు గట్టిగా అల్లరి చేస్తే అత్తయ్య తిడ్తుంది, వూరుకోండిరా అని మందలించే వదినగారు-ఏదైనా కావాలని పిల్లలు తన అత్తగారి దగ్గర మారాం చేసినా- 'ఉప్-మీ వదిన్నడగండిరా'' అని తన పిల్లలను కూడా కోడలి దగ్గరకే పంపించే తనత్తగారు-యివన్నీ మనసులో అల్లరి చేయడం

**అడబాల రాజ్యలక్ష్మి**

ప్రారంభించాయ్.


అలా తను ఏలిన రాజ్యంలో ఎంత మంది పావులయ్యారో-అప్పటి తన అత్త గారి మనస్థితి ఏమిటో సరస్వతికి తెలీదు, కానీ యిప్పటి తన స్థితి, తనకు మరీ నరక ప్రాయంగా వుంది. తిండీ బట్టా దొరుకు తుంటే లోటేమిటీ అనుకుంటే-సరస్వతికి ప్పుడూ లేదు లోటు. కానీ యింకేదో కావాలి. ఆ ఏదో ఆమెకూ తెలీసీ-తెలీనట్టు పారిపోతోంది.

ఎంతనుకున్నా డెభ్భయ్ ఏళ్ళ ముస లమ్మ పదిహేడేళ్ల వయసున్న పిల్లను పలక రించగలదే కానీ-స్నేహం చెయ్యలేదుగా. అలాగే ఆ అమ్మాయి కూడా అవ్వను గౌరవించగలదేకాని భుజం మీద చెయ్యేసి నడవలేదుగా. ఇదీ మానవధర్మం అయినా, ఆ ధర్మాన్ని స్వయంగా ఎదుర్కోవలసి వచ్చిన ప్పుడు, మనిషి పడేయాతన, అది సరస్వతికే తెలుసు.

మెల్లగా లేచి తన ప్రాతఃకాల విధులను ముగించు కుంది. కాఫీ గ్లాసు తెచ్చి తను కూర్చున్న దగ్గర కాస్త ఎడంగా పెట్టేసి కోడలు వెళ్లిపోయింది. అంటే అర్థం ' ఆ కాఫీ తీసుకుని తాగవే' అని చెప్పడమన్నమాట. ఈ మాట కోడలు నోటితో చెప్పలేదు. ఈ సృష్టిలో మాట్లాడగలిగే ప్రాణి ఒక్క మనిషే. మిగిలిన ఏ ప్రాణికీ ఆ అవకాశం లేదు. ఆ మనిషే యిష్టం లేనప్పుడు మాట్లాడకుండా అనేకంగా వున్న తన అవయవాలతో ఎదుటివాళ్లకు ఎన్నో సూచనలు యివ్వగలదు.

అలాగే సరస్వతి కోడలు యిప్పుడు తను రావటం ద్వారా-గ్లాసు అక్కడ పెట్టేటప్పుడు చూసిన చూపుల ద్వారా, యిన్ని మాటలూ అత్తగారి ఆత్మకు వినిపించేసింది. ఇది రోజూ జరుగుతున్నదే అయినా యీరోజు సరస్వతి మనసేమీ బాగోక-చాలా బాధవేసి కళ్లల్లో నీళ్లు తిరిగాయ్. ''కాఫీ తీసుకోండి అత్తయ్యగారూ'' అని కోడలు నోటితో అని వుంటే ఈరోజు మనింట్లో ఏమిటమ్మా విశేషం అని అడ గాలనుకొంది అత్తగారు. గ్లాసు కింద పెట్టేసి గిరుక్కున వెనక్కు తిరిగి పోయిన కోడలితో ఏవిధంగా మాటలు కల పాలో ఆమెకూ అర్థం కాదు. సరే తప్పేదేవుంది. తన బాధ ఆ కాఫీ మీద చూపిస్తే ఎండిపోయేది తన గొంతే.

అందుకే ఆ గ్లాసు తీసుకుని మెల్లి మెల్లిగా కాఫీ సేవిస్తూ కూర్చుంది. వీధిలో అందరి నవ్వులూ సందడీ వినిపిస్తోంది. మెల్లిగా లేచి బయటకు వచ్చింది. అక్కడ పెద్దమనుమరాలూ, ఆమె భర్తా ఆటో దిగు తున్నారు. అక్కడ తన కొడుకు, అల్లుడికి అడ్డం పడి ఆటోవాడికి తనే డబ్బులిస్తూ కని పించాడు. అల్లుడు మురిసిపోతూ పరవస్తు మరదళ్లను పలకరించుకుంటూ లోపలికి వెళ్లి పోయాడు. ఓ పక్కగా నిలబడ్డ [illegible] కూడా ఆ కుర్రాడు గుర్తించలేదు. [illegible] రగా కూతురుని పొదివి [illegible] యిల్లు




చెబుతూ తీసుకుపోతున్న కోడలూ- అందరూ లోపలికి వెళ్లి పోయారు. తను వుసూరుమంటూ అక్కడే వున్న సోఫాలో వాలింది.


అది నిద్రో, మగతో జీవిత చరమ దశలోని వైరాగ్యమో తెలీదు. భోజనాల టైముకి పెద్ద మనుమరాలు వచ్చి లేపింది. ''ఏంటి నాన్నమ్మా! నేను చూసేటప్పటికి నువ్వు నిద్రపోయావు. నేను వచ్చాననైనా చూడకుండా. భోజనానికి రా!'' అంది మామూలుగా. ''సెభాష్ మనవరాలా. బాగా అడిగావ్. తప్పంతా నాదేమరి. ఈయింటి పెద్దరికాన్ని నేను దుర్వినియోగం చేశాను, నిన్ను అగౌరవ పర్చి'' అను కొంది. ఈ మాటలన్నీ సరస్వతి నోరుకాదు-పొద్దున్నే కోడలి భాషలాగే-సరస్వతి మనసు మాటాడింది. దానివల్ల భవ్య కేమీ యిబ్బంది కలగలేదు. ఆమె ''రా'' అనేసి వెళ్లిపో యింది.

భోజనాల దగ్గర కొత్త మనవడు కూడా, ''నానమ్మ గారూ! బావున్నారా!'' అని పలకరించాడు. అక్కడికది సంతోషమే. ఆ నవ్వులూ, కేరింతల మధ్య తను మౌనంగా భోంచేసి ఎప్పుడెళ్లి బయట కూర్చుందో. ఎవరూ పట్టించు కోలేదు. తన కొడుకు దృష్టి భార్యాబిడ్డల మీద, వచ్చిన కొత్తల్లుడు మీద. ''అబ్బాయికి యింకాస్త స్వీటు వడ్డిం చవే'' అని కొడుకు అనడం, కోడలు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ వడ్డించటం, 'చాలు చాలని' ఆ కుర్రాడు తిరస్కరించటం-ఇందులో ఏదీ సరస్వతి దృష్టిని దాటిపో లేదు. వాడు మటుకు ఏం చేస్తాడులే. నటుడు స్టేజీమీద మట్టుకు నటిస్తే చాలు-మరి మనిషో. జీవిత మంతా నటించాలి. చిన్నప్పుడు తల్లిదం డ్రుల కోసం-యవ్వనంలో భార్యాబిడ్డల కోసం-మరి కొద్దిరోజులు మనుమల కోసం-తరవాత తన కోసమే తను నటించు కొని-అంటే వాళ్లంతా నాకోసమే వున్నారూ అనే మానసికానందం పొందుతూ తనువు చాలించాలి. అదే యిప్పుడు కొడుకు చేస్తు న్నది కూడా. తన రెండవ దశలోని పాత్రను అద్భుతంగా పోషించుకుంటున్నాడు. ఆ నటన కుదరకపోతే రాత్రి భార్యకు సమా ధానం చెప్పుకోవటం కష్టం. ఇప్పుడింక తల్లికి చెప్పుకోవలసింది ఏమీ లేదు,'' ''అన్నం తిన్నావా అమ్మా'' అని అడగడటం తప్పు.


సాయంత్రం అయ్యేకొద్దీ పెద్ద మనుమరాలు స్నేహితు లతో యిల్లు నిండిపోతుంది. మధ్యాహ్నం నుంచీ ఎడతెగ కుండా ఫోను మోగుతూనే వుంది. వీరు చెయ్య-అటు నుంచి ఎవరో చెయ్య. ఆ ఫోన్లను బట్టి కొత్తమనవడికి ఫారిన్ ఛాన్స్ వచ్చిందనీ, అలా వెళ్లేముందు అత్తవారింటికి వచ్చి, భార్యను దిగబెట్టి వీడ్కోలు తీసుకోవటానికే యిద్దరూ వచ్చారనీ అర్థమైంది. సాయంత్రానికల్లా భవ్య ఫ్రెండ్స్ స్వీట్లు-ఖారాలు-కూల్‌డ్రింకులూ-యిల్లంతా నవ్వులతో ఎగిరిపోతుంది. ఎవ్వరూ మాట్లాడకపోయినా గుమ్మంలో కూర్చుంటే తనకూ కాలక్షేపంగా వుంది. నాలుగురోజులీ సందడి జరిగాక మనుమడు వెళ్లిపోయాడు. ఇప్పుడింట్లో యింకో మనుమరాలు చేరడం-కాస్త సందడెక్కువగా వుంది.

కూతురు వట్టి మనిషి కాదని తెలుసుకున్న కొడుకూ, కోడలూ, ఆ అమ్మాయిని మరీ గారం చేస్తూ క్షణం తీరిక లేకుండా వున్నారు. ఆ మనుమల దగ్గర్నుంచెన్నో తెలుసుకో వాలని తనకున్నా తన దగ్గర కొచ్చేసరికి పొడి పొడి మాటలే గాని తనకు తగినంత వివరణ యివ్వటానికి వాళ్లకీ ఖాళీ లేదు. పాపం, వెళ్ళింది మొగుడే అయినా ఫారిన్ వెళ్లింది భవ్యే నన్నంత అపురూపంగా వాళ్ల మాటలూ, చేష్టలూ, ఖాళీగా అమ్మగారింట్లో కూర్చున్న భవ్యకు ఏమీ తోచక అస్త మానూ ఎవరెవరినో రప్పించుకోడం-వాళ్లతో తను బయ టకు వెళ్లటం-యిలా- ఆ యిల్లు చాలా సందడిగా మారి పోయింది.

ఓ రకంగా ఆ పిల్లలను చూస్తే తనకూ బాగానే వుంది. అందులో మనవరాళ్ల కోసం వచ్చే మగ స్నేహితుల వరసే సరస్వ తికి బొత్తిగా నచ్చడం లేదు. కాలం ఎంత మారిపోతే మటుకు-ఏమిటో కేరిం తలు-తన రోజుల్లో ఎంత చదువున్నా మగ పిల్లలు యింటికొచ్చే హక్కుందా? ఆరో [illegible] పెంచిన తల యింటి దగ్గరే ఎత్తాలని అమ్మ ఆర్డరు. ఇప్పుడేవీ ఆ పట్టింపులు-తల్లీ, పిల్లలూ చేరిపోయి ఆ మొగపిల్లలతో కేరింతలు.



అదే బొత్తిగా నచ్చని ఆమె ఓ రోజు మనమరాళ్లను మందలించాలనుకొంది. "బొత్తిగా ఏమిటా నవ్వులు రమ్యా" అంది చిన్న మనవరాలితో. అంతే! యింట్లో అందరూ 'గయ్'మని లేచారు ఆమె మీద. తిరిగి ఆమె నోరు మెదపలేకపోయింది. "ఎంతవమానం" తన మాటకున్న విలువెంతో తెలిసిపోయింది. ఆ విషయం అంతటితో పోలేదు. ఆ రాత్రి కోడలూ-కొడుకూ అనుకోవటం వింది.




"అది చిన్నపిల్ల. దాని మొగుడెక్కడో దూరంగా వున్నాడు. ఈవిడకెందుకండీ ఆ పిల్లగొడవ. అడ్డమైన వాళ్లనూ యింటికి తెస్తున్నావని మీ అమ్మగారు తిట్టిందీ అని, అది రోజంతా ఏడుస్తూ కూర్చుంది.రేపా పిల్ల ఆరోగ్యం పాడైతే ఎవరి కృష్టం" అని కోడలు గట్టిగానే కేకవేసింది.

కొడుకేమీ అనలేక వూరికే చూస్తూ కూర్చున్నాడు. కానీ బయటకొచ్చి తల్లిని మటుకు అనగలిగాడు. "నీకెందుకే అమ్మ ఆ పిల్లల గొడవ" ఇంత మాత్రానికి కూడా తను తగదన్నమాట. ఆరోజు మనసంతా పుండైపోయింది. ఓ వారం రోజులు మౌనంగా వూరుకుంది. తరవాత మెల్లగా కొడుకు దగ్గర చేరి అడిగింది, "నేను ఢిల్లీ తమ్ముడి దగ్గర కెడతానురా కొన్నాళ్లు" అంది.

"ఇప్పుడెందుకమ్మా అక్కడికి" అనేసి లోపలికెళ్లిపోయాడు. ఇక్కడికంటే అక్కడ తన పరిస్థితి బావుంటుందని కాదు, ఈ పరిస్థితి నుంచి కొన్ని రోజులు మార్పు కోరుతోంది ఆమె మనసు. అంతే.

"ఏం! వెళతానంటే పంపించవచ్చుగా. మనం వక్కళ్లేనా ఏమిటి మీ అమ్మగారికి వున్నది " అంటోంది లోపల కోడలు.

"రేపు పెద్దమ్మాయికి పురుడొస్తే యింత మందికీ నేను చెయ్యలేను" అంటోంది ఆమే మళ్లీ.

తరవాత తన గురించి ఆ యింట్లో ఎక్కువగా ఎవరూ మాట్లాడలేదు. తన రోజుల్లో యింటి ఆడపిల్ల కనడానికి వస్తే ఎక్కడి పెద్దవాళ్లనూ తెచ్చుకుని యింట్లో తోడుకావాలనుకునే వారు. ఇప్పుడు అమ్మాయి 'కంటే' అత్తగారు అడ్డు అనుకొంటోంది తన కోడలు. 'సెభాష్' అనుకుంది. ఆ పెద్ద మనసు. అంతే. ఆ మరుసటి రోజు-తనను ఢిల్లీ బండి ఎక్కించి "తమ్ముడికి టెలిగ్రాం యిచ్చాను. పక్క వాళ్లు వెళ్లేది మన తమ్ముడుండే ప్రాంతమేనట. జాగ్రత్తగా వెళ్లి దిగంగానే తమ్ముడితో వుత్తరం రాయించు" అని చెయ్యి తిప్పి టాటా చెప్పాడు తన కొడుకు. అది తనకు వీడ్కోలు చెపుతున్నట్టు లేదు. తనను వదిలించుకొని చేతులు దులుపుతున్నట్టు అనిపించిందామెకు. అలవికానంత నిరాశతో సీటుకి జారబడింది ఆ పిచ్చితల్లి.

★

# నేర పరిశోధనకు ఆద్యుడు ఓ క్రిమినల్

ఏ వ్యక్తీ కూడా పుట్టుకతో నేరస్థుడు కాడు. పరిస్థితుల ప్రభావం, పరిసరాల ప్రాబల్యం మనిషిని గుణవంతునిగానో, నేరస్థునిగానో తీర్చి దిద్దుతాయి. అయితే నేర ప్రవృత్తికి అసలు కారణం తెలుసుకుని సరియైన విధంగా ట్రీట్ చేస్తే పరమ కిరాతకులైన నేరస్థులను కూడా సమాజానికి ఉపయోగపడగల ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చు. ఈ యదార్థానికి సజీవ తార్కాణం యూజీన్ ఫ్రాంకాయ్ విడాక్ జీవితం.

నేరస్థులను పట్టుకోడానికి ప్రభుత్వమే ఒక నేరస్థుని డిటెక్టివ్‌గా నియమించడం, అతగాడు ఆ హోదాలో ఎందరో కరడుగట్టిన నేరస్థులను పట్టిఇచ్చి శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వానికి సహాయపడడం కథలలో, కవుల కల్పనలో సాధ్యం కావచ్చునేమో కాని వాస్తవ జీవితంలో సంభవమా! అసంభవం వంటి ఈ సంభవం విడాక్ జీవితంలో జరిగింది.

యూజీన్ ఫ్రాంకాయ్ విడాక్ 1775వ సంవత్సరంలో ఫ్రాన్స్‌లోని అరాస్‌లో జన్మించాడు. గట్టిగా పదిహేనేళ్ళు లేని వయసులో తన డబ్బు దొంగతనం చేసినందుకుగాను కన్నకొడుకునే జైలుకి పంపించాడు తండ్రి. జైలు జీవితం విడాక్‌లో నేరప్రవృత్తిని పెంచింది కాని తగ్గించ లేదు. జైలు నుంచి విడుదల అయ్యాక ఫ్రెంచి సైన్యంలో జేరాడు విడాక్. అయితే శత్రువులైన ఆస్ట్రియన్ సైన్యం చేతిలో బందీ అయ్యాడు. బయట పడ్డాక కూడా ఆ భాగ్యం ఎక్కువ కాలం నిలువలేదు. లిలీగాల్‌లోని ఒక ఖైదీని జైలు నుంచి తప్పించే ప్రయత్నంలో ఒక నకిలీ వ్యక్తికి సహాయపడ్తుండగా పట్టుబడ్డాడు. ఫలితంగా తెరచాప నౌకలకి తెడ్డు వేసే బానిస శిక్ష పడింది. నరక ప్రాయమైన ఆ బానిసత్వపు బంధాల నుండి బయట పడడానికి మూడుసార్లు ప్రయత్నం చేశాడు. కాని ప్రతీసారీ పట్టుబడ్డాడు. కాళ్ళకీ, చేతులకీ గొలుసులు వేసి పశువును ఈడ్చుకువచ్చినట్లు తీసుకొచ్చి జైల్లో పడేసేవారు పోలీసులు. ఈ విధంగా పన్నెండు సంవత్సరాలు గడిచాయి. పోలీసులతో దాగుడు మూతలు ఆడే ఓపిక పూర్తిగా నశించింది. చివరికి తనని ఓడల మీద బానిసగా పంపకుండా వుంటే శిక్షాకాలంలోని శేష భాగాన్ని బుద్ధిగా గడుపుతానని మాటిచ్చాడు. అంతేకాదు. పారిస్‌లోని సెకండ్ డివిజన్ పోలీస్ ఛీఫ్ అయిన మాన్సియర్ హెన్రీకి తాను నేరస్థుల ఆనుపానులు తెలిపే ఇన్‌ఫార్మర్‌గా ఉండగలననీ తన సేవలు వినియోగించుకోవలసిందని అభ్యర్థిస్తూ లేఖ రాశాడు.

మామూలుగా అయితే ఒక నేరస్థుడు రాసిన అటువంటి ఆ ఉత్తరాన్ని చింపి అవతల పడేసి ఉండేవారు పోలీసు అధికారులు. కానీ హెన్రీ కుశాగ్ర బుద్ధికి విడాక్ చేసిన సూచనలోని ప్రయోజనం గోచరించింది. అతని మాటలలో చిత్త శుద్ధి కనిపించింది. ఈ వాస్తవాన్ని గ్రహించిన హెన్రీ వెంటనే ప్రతిస్పందించి విడాక్‌ని పారిస్‌లోని లోఫోర్స్ జైలుకి తరలించాడు. పారిస్‌లో కరడుగట్టిన గూండాల వివరాలు తెలుసుకోవడానికి విడాక్‌ని వినియోగించాడు హెన్రీ. నేరస్థుడన్న ముద్ర పడిన విడాక్ వారితో సులువుగా కలిసిపోయి వారి గుట్టుమట్టులూ, ఆనుపానులూ అన్నీ తెలుసుకుని వచ్చేవాడు. ఈవిధంగా ఆతని సహాయంతో పోలీసులు ఎన్నో ఘోరమైన నేరాలను నిరోధించగలిగారు.

కొంతకాలం తర్వాత గూండాలు విడాక్ పోలీసు గూఢచారి అన్న విషయం కనిపెట్టాడు. దానితో అతనికి వారితో కలిసిమెలిసి తిరగడం అసాధ్యమయింది. అటువంటి సమయంలో హెన్రీ 'సురేట్' అనే గూఢచారి సంస్థను నెలకొల్పాడు. విశేషమేమిటంటే ఈ సంస్థకి ఆధ్వర్యం వహించడానికి విడాక్‌నే నియమించాడు హెన్రీ. అంటే మాజీ నేరస్థుడు పూర్తి జీతం మీద డిటెక్టివ్‌గా పనిచేసే స్పెషల్ బ్రాంచ్ అధికారి అయ్యాడన్న మాట.

ఈనాడు ప్రపంచవ్యాప్తంగా వున్న ప్రైవేట్ డిటెక్టివ్ ఏజన్సీలకు మాతృక ఇదే. అయితే ఈ సంస్థ పారిస్ నగరంలోని ఘరానా పెద్దలకు ప్రాణాంతకంగా ఉండడంతో వారు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి దానిని మూసి వేయించారు.

రాను రాను విడాక్‌కి పరిస్థితులు దారుణంగా పరిణమించసాగాయి. మాన్షియర్ హెన్రీ దూరం అయిపోయాడు. తమ వృత్తికి అడ్డువస్తున్నాడని అండర్ వరల్డ్ డాన్స్, ఒకనాటి నేరస్థుడు డిటెక్టివ్ కావడమేమిటన్న అసూయతో పోలీసులు అతనికి అన్ని విధాలా ఇబ్బందులు కలిగించసాగారు. చివరికి ఎవ్వరూ పట్టించుకోని పరిస్థితులలో 1855లో దయనీయంగా కనుమూశాడు యూజీన్ ఫ్రాంకాయ్ విడాక్. కాని పోలీసు వ్యవస్థలో అతిముఖ్యమైన 'క్రైం డిటెక్షన్'కి రూపకల్పన చేసిన ఘనత అతనిదే.

-కె ఆర్.కె.మోహన్